సాక్షి
అన్నమయ్య జిల్లా
సోమవారం । 10 । ఫిబ్రవరి । 2025



దేవుడా.. ఎంతపని చేశావయ్యా!

బి.కొత్తకోట మండలం కుమ్మరపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అయ్యో దేవుడా బిడ్డలతోనే తండ్రిని బలి తీసుకున్నావా అంటూ బంధువులు బోరున విలపించారు. -8లో



ఎమ్మెల్యే అనుచరుడి జేసీబీ సీజ్

ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అనుచరుడు వేణుకు చెందిన జేసీబీ అనుమతి లేకుండా చెరువులో మట్టి తరలిస్తుండగా, రెవెన్యూ అధికారులు పట్టుకుని వాహనాన్ని సీజ్ చేశారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.160	రూ.200
రెండోరకం	రూ.100	రూ.150



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 55 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్ఠం	గరిష్ఠం
బైవోల్టిన్	-	-
సీబీ	705	705



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 45.980 కిలోలు

న్యూస్‌రీల్

నేడు మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: తంబళ్లపల్లె వద్దనున్న ప్రముఖ శైవక్షేత్రమైన మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ–1 డిఎం మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం 5.30 గంటలకు, 6.30 గంటలకు మల్లయ్యకొండకు బస్సులు వెళతాయన్నారు. అక్కడి నుంచి రాగిమాను సర్కిల్ నుంచి మల్లయ్యకొండకు సాయంత్రం వరకు షటిల్ సర్వీసులు నడుస్తాయన్నారు. భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి: ప్రజల నుంచి సమస్యలను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈనెల 10వ తేదీన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరగనుంది. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ ఆదివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి పత్రికలకు అందజేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గంగమ్మా..కరుణించవమ్మా



పూజల్లో పాల్గొన్న భక్తులు

లక్కిరెడ్డిపల్లి: మండల పరిధిలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా అర్చకుడు చెల్లు గంగరాజు యాదవ్ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గంగమ్మా..కరుణించి కాపాడు తల్లి అని వేడుకున్నారు. అర్చకుడు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసులు, మధుసూదన్ రెడ్డి, మార్కెండేయ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేద్దాం

రాయచోటి అర్బన్: జిల్లాలో ఈనెల 10వ తేదీన నిర్వహించే నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేద్దామని జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌ఓ శైలజ, రాష్ట్రీయబాల స్వస్థ్య కార్యక్రమం జిల్లా కోఆర్డినేటర్ శివప్రతాప్ పేర్కొన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాలలోపు వయస్సుగల పిల్లలు 4,06,121 మంది ఉన్నారన్నారు. వీరందరికి ఆల్బెండజోల్ –400 ఎంజీ మాత్రలు ఇస్తామని తెలిపారు.కార్యక్రమం విజయవంతానికి వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, స్త్రీ,శిశు సంక్షేమశాఖ, పుర పాలకశాఖ, పంచాయతీరాజ్ స్వచ్ఛంద సేవాసంస్థలతో సమన్వయ సమావేశంను నిర్వహించినట్లు చెప్పారు. జిల్లా లోని అన్ని ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలలు జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేం ద్రాలలో ఈమాత్రలను పంపిణీ చేస్తామనాని తెలిపారు.

రేపటి నుంచి శ్రీరంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు



శ్రీరంగనాథస్వామి మూల విరాట్ (ఫైల్‌ఫోటో)

పులివెందుల టౌన్: పులివెందుల ప్రాంతంలో అతిపురాతనమైన శ్రీరంగనాథస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి అంకురార్పణతో ప్రారంభం కానున్నట్లు ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఈఓ రమణలు పేర్కొన్నారు. స్థానిక పూల అంగళ్ల సర్కిల్ వద్ద ఉన్న శ్రీరంగనాథస్వామి కాంప్లెక్స్‌లో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. శ్రీరంగనాథస్వామి ఉత్సవ మూర్తులతో మండపంలో కొలువుతీర్చి 9రోజులపాటు రోజుకో అలంకారంలో ప్రత్యేక పల్లకిలో శ్రీరంగనాథుడు సతీసమేతుడై పట్టణ పురవీధులలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ప్రధాన అర్చకులు కృష్ణరాజేష్ శర్మ ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. అత్యంత వైభవంగా జరిగే శ్రీరంగనాథుని బ్రహ్మోత్సవాలలో భక్తులు పాల్గొని తరించాలని నిర్వాహకులు కోరారు.

సాంస్కృతిక ప్రదర్శనలు: శ్రీరంగనాథుని బ్రహ్మోత్సవాలలో భాగంగా 11 నుంచి 9రోజుల పాటు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నారు. సాంస్కృతిక ప్రదర్శనలతోపాటు పౌరాణిక ప్రదర్శనలు, నాటక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్రభుత్వ బడికి ముప్పు

మదనపల్లె మండలం ఆవులపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకటి నుంచి 8వ తరగతి వరకు 29 మంది విద్యార్థులున్నారు. ఈ పాఠశాల ప్రైమరీ స్కూల్‌గా మారనుంది. దీంతో 6 నుంచి 8 తరగతులు చదవాలనుకున్న విద్యార్థులు మదనపల్లె మండలం మాలేపాడు ఉన్నత పాఠశాలకు లేదా రామసముద్రం మండలం చెంబకూరు ఉన్నత పాఠశాలకు వెళ్లాల్సి వుంది. మాలేపాడు 20 కిలో మీటర్లు, చెంబకూరు 7 కిలో మీటర్లు ఉంది. 117 జీవో రద్దు పేరిట కూటమి ప్రభుత్వం ఆడుతున్న డబుల్‌గేమ్‌తో విద్యార్థులకు ఇబ్బందులు తప్పవు.

- రేషనలైజేషన్‌తో మూతపడనున్న స్కూళ్లు
- 117 జీవో రద్దు పేరిట కూటమి సర్కార్ కొత్త ఎత్తుగడ
- హైస్కూళ్లల్లో విలీనం కానున్న ప్రాథమికోన్నత పాఠశాలలు
- బడికి దూరం కానున్న పేద విద్యార్థులు



ప్రాథమిక పాఠశాలగా మారనున్న మదనపల్లె మండలం ఇసుకనూతపల్లె ప్రాథమికోన్నత పాఠశాల

మదనపల్లె రూరల్ మండలం ఇసుకనూతపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకటి నుంచి 8వ తరగతి వరకు నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో 30 మంది విద్యార్థులున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో యూపీ స్కూల్ కాస్తా ప్రైమరీ స్కూల్‌గా మారనుంది. 6 నుంచి 8 తరగతుల విద్యార్థులను సమీపంలోని బాలాజీనగర్ ఉన్నత పాఠశాలకు విలీనం చేయనున్నారు. దీంతో వారికి ఇబ్బందులు తలత్తే ప్రమాదం ఉంది.

మదనపల్లె సిటీ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే సర్కారు బడులపై గుదిబండ వేసింది. వీటిని అభివృద్ధి చేయాల్సింది పోయి విలీనం అనే పేరుతో కత్తి దూస్తోంది. ఈ విలీనం ప్రక్రియ చేపట్టమని హామీ ఇచ్చినప్పటికీ ఆ హామీని తుంగలో తొక్కింది. కార్పొరేట్ బడులకు మేలు చేకూర్చే విధంగా అసంబద్ధ నిర్ణయాలు తీసుకుంటోంది. జిల్లాలో ప్రతి మండలంలో ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు నెలకొల్పేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని విద్యాశాఖను ఆదేశించింది. ఈ మేరకు గుట్టుచప్పుడు కాకుండా ప్రతిపాదనలు సైతం సిద్ధం చేసి ఇటీవల రాయచోటి జిల్లా కేంద్రంలో సమావేశం నిర్వహించి చర్చించారు.

'హామీలు తూచ్..

జిల్లాలోని ప్రతి పల్లెలో 3 కిలోమీటర్ల పరిధిలో ప్రాథమికోన్నత పాఠశాలలు, 5 కిలోమీటర్ల పరిధిలో ఉన్నత పాఠశాలలు గతం నుంచి నడుస్తున్నాయి. అయితే కూటమి ప్రభుత్వం విలీనం పేరుతో సర్కారు బడులకు నష్టం చేకూరేలా చర్యలు చేపడుతోంది. విలీనం ప్రక్రియ వద్దని అన్ని ఉపాధ్యాయ సంఘాలు, తల్లిదండ్రులు, టీచర్లు మొరపెట్టుకున్నారు. ఇదే సందర్భంలో విలీనం చేసేది లేదని చెప్పి.. ప్రస్తుతం ఆ హామీని తూచ్ అనిపించింది. విలీనం ప్రక్రియ చేపడితే గ్రామం నుంచి విద్యార్థులు వేరే గ్రామాలకు వెళ్లి చదవాల్సిన పరిస్థితి ఉంటుందని తల్లిదండ్రులు అంటున్నారు. డ్రాపౌట్స్ శాతం పెరుగుతుందని విద్యావేత్తలు వాపోతున్నారు. ఈ విలీన కసరత్తు పూర్తి అయితే తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలకు పిల్లలను పంపడం ఖాయమని టీచర్లు వెల్లడిస్తున్నారు.

కసరత్తు ఇలా...

జిల్లాలో ఏకోపాధ్యాయ పాఠశాలలను గుర్తించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. 60 మంది విద్యార్థులు ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలను మోడల్ ప్రైమరీ పేరుతో మార్చేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ మోడల్ ప్రైమరీ (ఆదర్శ పాఠశాలలు) ఎక్కడెక్కడ అవసరమని కసరత్తు చేపడుతున్నారు.

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల వివరాలు

పాఠశాల కేటగిరీ	స్కూళ్లు	విద్యార్థులు
ప్రాథమిక	1,734	43,947
ప్రాథమికోన్నత	162	11,653
ఉన్నత	304	80,864



ఇచ్చిన హామీ మేరకు కసరత్తు చేయాలి



కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పాఠశాలల విలీన ప్రక్రియ కసరత్తు చేయాలి. 3 కిలో మీటర్ల పరిధిలో ఉన్నత పాఠశాలలు అందుబాటులో లేకపోతే అటువంటి చోట ప్రాథమికోన్నత పాఠశాలలను కొనసాగించాలి. ప్రతి మోడల్ స్కూల్‌కు విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా హెచ్‌ఎం పోస్టును మంజూరు చేయాలి.
–మధుసూధన్, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

డ్రాపౌట్స్ పెరుగుతారు



విలీన ప్రక్రియతో డ్రాపౌట్స్ ఎక్కువ అవుతారు. ప్రభు త్వం ఏది చేపట్టినా మేలు కలిగేలా ఉండాలి. కానీ నష్టం చేకూర్చకూడదు. ఈ కసరత్తు వల్ల ప్రైవేటు బడులకు విద్యార్థులు వెళ్లిపోతారు. విలీన కసరత్తుతో గ్రామీణ ప్రాంతాల్లో డ్రాపౌట్స్ పెరిగే అవకాశం ఉంది.
–వి.వెంకటరమణ, యుటిఫ్ జిల్లా కార్యదర్శి

విలీనప్రక్రియ నిలిపేయాలి



కూటమి ప్రభుత్వం హామీకి విరుద్ధంగా విలీన ప్రక్రియ చేపడుతోంది. 117 జీఓను రద్దు చేస్తామన్నారు. రాష్ట్ర స్థాయిలో సంఘ నేతలతో నిర్వహించిన సమావేశంలో విలీన ప్రక్రియ కసరత్తు విధివిధానాలను చెప్పింది ఒకటి క్షేత్ర స్థాయిలో చేస్తున్నది మరొకటి. ఈ విలీన ప్రక్రియ నష్టం చేకూరుస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విలీన ప్రక్రియను నిలిపివేయాలి. లేని పక్షంలో ఆందోళనలు చేస్తాం. –ఆర్.వి.రమణ, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి

హార్సిలీహిల్స్‌పై పటిష్ట భద్రత

- సీజేను మర్యాద పూర్వకంగా కలిసిన ఎస్పీ



సీజే ధీరజ్ సింగ్ టాకూర్‌కు బొకే అందిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ విడిది చేయడంపై ఆదివారం పోలీసు అధికారులు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. సీజేకు కల్పించాల్సిన ప్రొటోకాల్‌పై అధికార వర్గాల్లో జరిగిన చర్చపై సాక్షిలో కథనంపై ప్రచురితమైంది. దీంతో వివిధ శాఖల అధికారులు అప్రమత్తం అయ్యారు. శనివారం రాత్రే గవర్నర్ బంగ్లా వద్దకు కలకడకు చెందిన 108 అంబులెన్స్ చేరుకుంది. ఆదివారం కొండపై వివిధ ప్రాంతాల్లో పోలీసులను మోహరించారు. తొమ్మిది కిలోమీటర్ల ఘాట్‌రోడ్డుపైనా పోలీసులు నిఘా వేసి బందోబస్తు నిర్వహించారు. సీజే విడిది చేసిన గవర్నర్ బంగ్లా వద్దకు మెటల్ డిక్టేటర్, బాంబ్ స్క్వాడ్ సిబ్బంది విధుల్లో కనిపించారు. జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు సీజేను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కొద్దిసేపు ఇద్దరు ముచ్చటించుకున్నారు. సాయంత్రం సీజే కొండపై నుంచి వెనుదిరిగ్గా అధికారులు సాదర వీడ్కోలు పలికారు. కాగా శనివారం రాత్రి సీజే గవర్నర్ బంగ్లాకు చేరుకునే ముందే భద్రతపరమైన తనిఖీలు, పటిష్ట బందోబస్తును ప్రోటోకాల్ మేరకు పోలీసు అధికారులు చేపట్టారు. అయితే సీజే సూచన మేరకు బంగ్లా పరిసరాల్లో ఇబ్బంది కలగకుండా సిబ్బంది విధులు నిర్వహించారని పోలీసు వర్గాలు తెలిపాయి. బంగ్లా పరిసరాలను జల్లెడ పట్టి భద్రతా సిబ్బంది విధుల్లో ఉన్నట్టు తెలిపాయి.

వారసత్వ కేంద్రంగా హార్సిలీహిల్స్

- ఏకో టూరిజంగా సమగ్ర అభివృద్ధి
- పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి



హార్సిలీ నిర్మించిన అతిథిగృహ సముదాయాన్ని పరిశీలిస్తున్న చిరంజీవి చౌదరి

బి.కొత్తకోట: బ్రిటీషు పాలకులు నిర్మించిన ఇలాంటి అతిథి గృహం అరుదైనది. దీన్ని వారసత్వ సంపదగా కాపాడుకోవాల్సిన బాధ్యత అటవీశాఖపై ఉందని అటవీశాఖ పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి అన్నారు. ఆదివారం హార్సిలీహిల్స్ అటవీ సముదాయంలో ఆధునీకరించి నూతనంగా ఏర్పాటు చేసిన అతిథిగృహాలను ఆయన ప్రారంభించారు. గదులను పరిశీలించారు. అటవీ సముదాయంలో నిర్వహిస్తున్న కార్యకలాపాలను తిలకించారు. బ్రిటీషు పాలనలో నిర్మించిన అతిథిగృహాలను పరిశీలించారు. అనంతరం తిరుపతి సీఎఫ్ సెల్వం, రాజంపేట డీఎఫ్‌ఓ జగన్నాథ్‌సింగ్, సబ్ డీఎఫ్‌ఓ శ్రీనివాసులు, రేంజర్ జయప్రసాదరావు, సెక్షన్ ఆఫీసర్ అడపా శివకుమార్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్నమయ్య జిల్లాలో ఏకైక పర్యాటక కేంద్రం, రాష్ట్రంలో ఏకైక వేసవి విడిది కేంద్రం హార్సిలీహిల్స్‌ను ఏకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేయాలన్నారు. దీని కోసం తగిన ప్రతిపాదనలు చేయాలని సూచించారు. నూతనంగా ఏర్పాటు చేసిన అతిథిగృహాల నిర్వహణలో ప్రమాణాలు పాటించాలని సూచించారు. హార్సిలీహిల్స్ కనుగొన్న హార్సిలీ నిర్మించిన అతిథి గృహాలకు ఎలాంటి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న కట్టడానికి ఎలాంటి మార్పులు చేయవద్దని ఆదేశించారు. వేసవిలో అడవుల్లో నిప్పు పెడతారన్ని దీన్ని అరికట్టేందుకు సిబ్బంది కరపత్రాలు, ఇతరా కార్యక్రమాల ద్వారా అటవీ సరిహద్దు గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అడవిలో నిప్పు పడితే క్షణాల్లో శాటిలైట్ ద్వారా సమాచారం అందడమేకాక మొబైల్ ఫోన్లకు సమాచారం అంది అప్రమత్తం చేస్తుందన్నారు. ఈ సాంకేతికత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నగర వనాల పనులు పెండింగ్‌లో ఉంటే పూర్తి చేయించాలని కోరారు. అడవుల్లోనేకాక మైదాన ప్రాంతాల్లో మొక్కలు నాటే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

రచనలతో చైతన్యం తీసుకురావాలి

- శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వీసీ నిత్యానందరావు
- ముగిసిన వైఎస్ఆర్ జిల్లా రచయితల సభలు



మాట్లాడుతున్న శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య నిత్యానందరావు

కడప కల్చరల్: కవులు, రచయితలు తమ రచనల ద్వారా ప్రజల్లో సామాజిక స్పృహ పెంచాలని.. ఆ బాధ్యత తీసుకోవాలని శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వెలుదండ నిత్యానందరావు అన్నారు. వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం ద్వితీయ మహాసభలు రెండు రోజులపాటు కడప నగరంలోని ఐఎంఏ హాలులో 'వెయ్యేళ్ల తెలుగు సాహిత్యం – రాయలసీమ భాగస్వామ్యం'అనే శీర్షికన ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి సాహిత్యవేదికపై నిర్వహించారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆదివారం పలు విభాగాలుగా సాహితీ కార్యక్రమాలు నిర్వహించారు. తొలి విభాగానికి ఆచార్య వెలుదండ నిత్యానందరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలోని రుగ్మతలను ప్రశ్నిస్తూ అభివృద్ధి దిశగా ప్రజలను సమాయత్తం చేయాల్సిన బాధ్యత రచయితలపై ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. సభాధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి రెండు రోజుల సభలను విశ్లేషిస్తూ రాయలసీమ అస్తిత్వాన్ని చాటిచెప్పేలా ఈ సభలను నిర్వహించామన్నారు. విద్యావేత్త అలపర్తి పిచ్చయ్య చౌదరి మాట్లాడారు.

డాక్టర్ జానమద్ది వేదికపై..

డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి సభావేదికపై జరిగిన తొలి సదస్సుకు మైనార్టీ కార్పొరేషన్ ఈడీ బ్రహ్మయ్య అధ్యక్షత వహించగా కమర్షియల్ టాక్స్ అసిస్టెంటు కమిషనర్ మోరగుడి వేణుగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలుగు సాహిత్య విమర్శ వికాసం – రాయలసీమ కృషి అనే అంశంపై మాట్లాడారు. ఎస్.విజయభాస్కర్, చింతకుంట శివారెడ్డి, వెల్లాల వెంకటేశ్వరచారి పలుసాహిత్య అంశాలపై పత్రసమర్పణ చేయగా, సంఘం ప్రతినిధి డాక్టర్ తవ్వా వెంకటయ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు.

రాజగోపాలనాయుడు వేదికపై..

మూడవ సదస్సును పి.రాజగోపాల నాయుడు సభావేదికపై నిర్వహించారు. రాజంపేట స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సాహితీవేత్తలు ముమ్మడి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా వ్యవహరించారు. ప్రముఖ రచయిత కేవీ రమణారెడ్డి, డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి, డాక్టర్ కొప్పోలు రెడ్డిశేఖర్ రెడ్డి, అవధాని ఆముదాల మురళి, డీకే చదువుల బాబు, అనుగూరు చంద్రశేఖర్‌రెడ్డి కూడా పలు సాహిత్య అంశాలపై ప్రసంగించారు.అనంతరం నీలం సంజీవరెడ్డి, బుద్ధా వెంగళరెడ్డి వేదికలపై కూడా సాహిత్య సమ్మేళనాలు నిర్వహించారు. విద్యార్థులకు నిర్వహించిన వేమన, భాస్కర శతక పద్యాల పఠన పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు.

మాయల మరాఠీ!

- దస్తగిరిది బెదిరిస్తే భయపడే మనస్తత్వమేనా?
- భయమే ఉంటే వైఎస్ వివేకా హత్యలో ప్రత్యక్షంగా పాల్గొనే వారా!
- రిమాండ్‌లో ఉండగా 11 సార్లు కోర్టు వాయిదాకు హాజరైన దస్తగిరి
- అదే సమయంలో జైళ్ల డీఐజీ నాలుగు సార్లు సందర్శన
- నందలూరు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ అదే బ్యారక్ పరిశీలన
- అప్పట్లో వారెవ్వరికీ ఎలాంటి ఫిర్యాదు చేయని వైనం
- తాజాగా దస్తగిరి ఫిర్యాదుతో పోలీసు కేసు నమోదు
- పోలీసు కేసు ఆధారంగా విచారణ చేయిస్తున్న ప్రభుత్వం

సాక్షి ప్రతినిధి, కడప: తెరవెనుక డైరెక్షన్ ఒకరైతే, తెరముందు యాక్టింగ్ మరొకరిది. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఆ విషయం సుస్పష్టంగా కన్పిస్తోంది. గొడ్డలితో నరికి, నరికి చంపానని చెబుతూ అప్రూవర్‌గా మారిన దస్తగిరిది ఒకరికి భయపడే మనస్తత్వమేనా? వైఎస్సార్ సీపీకి భయపడి ఫిర్యాదు చేయలేదన్నది శుద్ధ అపద్ధం. అప్పటికే ఆ విషయాలన్నీ హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. హైకోర్టు అవన్నీ వాస్తవాలు కాదనీ కొట్టి పారేసింది. తాజాగా మరో క్రిమినల్ కేసు నమోదుకు కారకుడై మాయలమారఠీగా అవతరించారు. ఆ ఫిర్యాదును పట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం ఆగమేఘాలపై విచారణ చేపట్టింది.


- కట్టుకథలు క్రమం తప్పకుండా తెరపైకి వస్తున్నా యి. అబద్ధాలను నిజం చేసే విష ప్రచారాలు ఊపందుకున్నాయి. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసును అడ్డుపెట్టుకుని ప్రత్యర్థులను ఇరికించేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలకు తెరలేపింది. అబద్ధాలకు రంగులు అద్దే పనిలో నిమగ్నమైంది. హైకోర్టు అబద్ధాలని కొట్టివేసినా.. మాటల ఆధారంగా క్రిమినల్ కేసు నమోదు చేసి విచారణ పేరుతో సరికొత్త ప్రణాళిక రచించే పనిలో రాష్ట్ర ప్రభుత్వం నిమగ్నమైంది.



సెంట్రల్ జైల్లోకి కోట్ల డబ్బులు తీసుకెళ్లడం సాధ్యమా!

దేవిరెడ్డి శివశంకరరెడ్డి తనయుడు డాక్టర్ చైతన్యరెడ్డి సెంట్రల్ జైల్లోకి రూ.20 కోట్లు డబ్బులు తీసుకవచ్చి ఆఫర్ చేశారని దస్తగిరి ఇది వరకూ హైకోర్టు దృష్టికి తీసుకెళ్లాడు. కాగా రూ.20 కోట్లు జైలుకు తీసుకు వచ్చినట్లు ఎలాంటి ఆధారాలు లేవని హైకోర్టు న్యాయమూర్తి తీర్పులో స్పష్టం చేశారు. తాజాగా ఇచ్చిన ఫిర్యాదులో గతంలో తాను హైకోర్టుకు చెప్పిన మాటలనే డ్రైవర్ దస్తగిరి మడతపెట్టాడు. డాక్టర్ చైతన్యరెడ్డి తనకు రూ.20 కోట్లు ఇస్తానని ఆశ చూపెట్టాడని మాట మార్చి మరో కొత్త అబద్ధం చెప్పాడు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉంది కాబట్టి ఫిర్యాదు చేయలేకపోయినట్లు తాజాగా తెలిపారు. వాస్తవాలను పరిశీలిస్తే దస్తగిరిని జైలులో డాక్టర్ చైతన్యరెడ్డి డబ్బులు ఆశ చూపెట్టడం, బెదిరించారన్నది కట్టుకథగా రూఢీ అవుతోంది. 2023 నవంబర్ 28న జైల్లో హెల్త్ క్యాంప్‌లు నిర్వహించారు. ఆ తర్వాత దస్తగిరి 11 సార్లు వాయిదాల నిమిత్తం కోర్టుకు హాజరయ్యారు. నాలుగు సార్లు డీఐజీ స్థాయి అధికారి సెంట్రల్ జైల్ తనిఖీలు చేశారు. నందలూరు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ అదే బ్యారక్ విజిట్ చేశారు. ఆయా సందర్భాల్లో ఎప్పుడైనా అటు కోర్టుకు లేదా జైళ్ల డీఐజీ లేదా ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్‌కు దస్తగిరి ఫిర్యాదు చేసిండాలి. రిమాండ్ ఖైదీగా ఉన్న దస్తగిరి బెయిల్ వచ్చాకే ఈ మొత్తం వ్యవహారాన్ని అప్పట్లో హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. హైకోర్టు తప్పుబట్టిన తర్వాత మళ్లీ రాష్ట్ర ప్రభుత్వ పెద్దల సహకారంతో సరికొత్త ప్రణాళిక రచించారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

వేగంగా స్పందించిన సర్కారు



2023 నవంబర్ 28న తనను బెదిరించినట్లుగా, ప్రలోభ పెట్టినట్లుగా 15 నెలల తరువాత డ్రైవర్ దస్తగిరి ఫిర్యాదు చేస్తే.. రాష్ట్ర ప్రభుత్వం జెట్‌స్పీడ్‌తో విచారణ అందుకుంది. దస్తగిరి ఆ ఫిర్యాదు ఆధారంగా ఈనెల 3వ తేదీన రాత్రి 11.30 గంటలకు జిరో ఎఫ్ఐఆర్ జారీ అయ్యింది. ఆధారాలు లేకుండా కేవలం ఆరోపణలు మాత్రమే చేస్తున్నారని హైకోర్టు స్పష్టం చేసినా.. అదే విషయాన్ని తాజాగా పోలీసులు కేసు నమోదు చేయగానే, రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఇదే ప్రభుత్వంలో ఐజీ ర్యాంకు అధికారి విచారణ చేపట్టిన తర్వాత ఇప్పుడు మళ్లీ ఎస్పీ ర్యాంకు అధికారి ద్వారా విచారణ చేయించడం అబద్ధాలను నిజంచేసే కుట్ర ఉందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. కాగా ఆరోపణలు ఎదుర్కొంటున్న డాక్టర్ చైతన్యరెడ్డి, మునపటి జైళ్ల ఎస్పీ ప్రకాశ్‌లను శనివారం విచారణ చేయడం గమనార్హం.

జాతీయస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌కు ఎంపిక



బొగ్గేటి శివశంకర్ రెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్: బెంగుళూరులో మార్చి 4 నుంచి 9 వరకు జరిగే జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్‌కు బొగ్గేటి శివశంకర్ రెడ్డి ఎంపికయ్యారు. ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు అనంతపురం జిల్లా పి టి సి గ్రౌండ్‌లో జరిగిన ఆంధ్రప్రదేశ్ మాస్టర్ అథ్లెటిక్స్ లో. 45+ వయసు విభాగంలో హై జంప్,లాంగ్ జంపులో రెండు బంగారు పతకాలు.. ట్రిపుల్ జంప్‌లో వెండి పతకం సాధించారన్నారు. ప్రతిరోజు విద్యార్థులతో పాటు తానూ సాధన చేయడం వల్లే పతకాలు సాధిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఘనంగా ఉరుసు



విద్యుద్దీప అలంకరణలో దర్గా

కడప కల్చరల్: కడప నగరం హబీబుల్లావీధిలో వెలిసిన హజరత్ నాదర్‌షావలీ రహమతుల్లాహి అలైఉరుసు మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా దర్గా చాందిని మెరవణి, ఖవ్వాలీ కచేరి, ముషాయిరా కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే ఉత్సవాలకు హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా స్థానిక భక్తులతోపాటు నగరంలోని పలువురు ప్రముఖులు దర్గా గురువుల మజార్‌ను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యే అనుచరుడి జేసీబీ సీజ్



తాలూకా పోలీస్ స్టేషన్‌లో జేసీబీ వాహనం

మదనపల్లె : ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అనుచరుడు జేసీబీ వేణుకు సంబంధించిన జేసీబీతో చెరువులో మట్టి తరలిస్తుండగా, రెవెన్యూ అధికారులు పట్టుకుని వాహనాన్ని సీజ్ చేసి తాలూకా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పొన్నూటిపాలెం పంచాయతీ సర్వే నంబర్.313 ఎర్రకదిరినాయునిచెరువు నుంచి దాదాపు 8 ట్రాక్టర్ల సహాయంతో మట్టిని తరలిస్తున్నారు. దీంతో స్థానికులు చెరువులో మట్టి తరలిస్తున్న విషయాన్ని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు లొకేషన్‌తో సహా వాట్సప్‌లో షేర్ చేశారు. దీంతో అప్పటికప్పుడు స్పందించిన సబ్ కలెక్టర్ రెవెన్యూ అధికారులను అప్రమత్తం చేశారు. మట్టి తరలింపును అడ్డుకోవాల్సిందిగా ఆదేశించారు. దీంతో ఆర్ఐ శేషగిరిరావు, వీఆర్‌ఓ నారాయణ, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది హుటాహుటిన వెళ్లి చెరువులో మట్టిని తవ్వుతున్న జేసీబీని సీజ్ చేశారు. వాహనాన్ని తాలూకా పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు.

కోడి పందెం జూదరుల అరెస్టు

పెనగలూరు : మండలంలోని నారాయణ నెల్లూరు గ్రామ సమీపంలోని మామిడి తోటలో కోడిపందేలు ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రవిప్రకాష్ రెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం అందిన సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి కోడిపందెం స్థావరంపై దాడులు నిర్వహించామన్నారు. రెండు కోడి పుంజులు, రూ. 20,140 నగదు స్వాధీనం చేసుకుని ఎనిమిది మందిని అరెస్టు చేశామన్నారు.

దంపతులపై దాడి



దాడిలో గాయపడిన ఉమామహేశ్వరి

పెద్దమండ్యం : వివాదంలో ఉన్న భూమిని సాగు చేయవద్దని వెళ్లిన దంపతులపై ప్రత్యర్థులు దాడి చేశారని బాధితులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని సీ గొల్లపల్లె పంచాయతీలోని చిన్నాయునివారిపల్లెలో శనివారం ఈ ఘటన జరగగా, ఆదివారం బాధితుల నుంచి పోలీసులు వివరాలను సేకరించారు. ఎస్‌ఐ పి.వి. రమణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చిన్నాయునివారిపల్లెకు చెందిన నరసింహులునాయుడు, లక్ష్మీపతినాయుడులకు మధ్య భూ వివాదం ఉంది. ఈ వివాదంపై కోర్టులో కేసు నడుస్తోంది. అయితే లక్ష్మీపతినాయుడు భూమిలో వరిసాగు కోసం పొలం దున్నుతుండగా వివాదం ఉన్న భూమిని సాగుచేయ వద్దని నరసింహులు నాయుడు, భార్య ఉమామహేశ్వరిలు వారించారు. దీంతో లక్ష్మీపతినాయుడు వర్గీయులు కొడవలి, పార, కట్టెలతో దంపతులపై దాడి చేశారు. వీరి దాడిలో ఉమామహేశ్వరి (45)కు చేతిపై బలమైన గాయాలయ్యాయి. అలాగే నరసింహులు నాయుడు (48)కు రక్త గాయాలయ్యాయి. గాయపడిన దంపతులను కుటుంబ సభ్యులు 108లో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించగా, అక్కడి నుంచి తిరుపతికి తీసుకెళ్లారు. తిరుపతిలో చికిత్స పొందుతున్న దంపతుల నుంచి ఎస్‌ఐ పి.వి. రమణ వివరాలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

దేవుడా.. ఎంతపని చేశావయ్యా.!



తండ్రి, బిడ్డల మృతదేహాల వద్ద విలపిస్తున్న బంధువులు



ఎర్రగుంట్లలో ఒకే చోట ముగ్గురి అంత్యక్రియలకు ఏర్పాట్లు

- ఇద్దరు బిడ్డలు, తండ్రికి ఒకేసారి అంత్యక్రియలు
- భర్త, బిడ్డలు ఏమయ్యారో తెలియక తల్లడిల్లుతున్న తల్లి
- విషాదంలో కుమ్మరపల్లి

బి.కొత్తకోట : అయ్యో దేవుడా ఈ పసి బిడ్డలు ఏం పాపం చేశారయ్యా తీసుకెళ్లిపోయావు..బిడ్డలతోనే తండ్రిని బలి తీసుకున్నావా..నీకు కనికరం కలగలేదా స్వామి అంటూ బి.కొత్తకోట మండలం కుమ్మరపల్లి గ్రామస్తులు విలపిస్తుంటే ఆదివారం సాయంత్రం విషాదఛాయలు అలుముకున్నాయి. ఎవరిని కదిలించినా ఇంత ఘోరమా స్వామి అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రీసత్యసాయిజిల్లా కదిరిలో చనిపోయిన పెదనాన్న కడసారి చూపుకోసం బయలుదేరిన కుటుంబాన్ని శనివారం ములకలచెరువులో ఐషర్ వాహనం ఢీకొనడంతో ముగ్గురు చనిపోగా, ఒకరు తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. చనిపోయిన తండ్రి, బిడ్డలకు కమ్మరపల్లి సమీపంలోని ఎర్రగుంట్లలో ఒకేసారి అంత్యక్రియలు నిర్వహించడం చూసిన గ్రామస్తులు తల్లడిల్లిపోయారు.

బి.కొత్తకోట మండలం కుమ్మరపల్లికి చెందిన ఎం.సోమశేఖర్ (36), భార్య కవిత (25), బిడ్డలు రెడ్డిశేఖర్ (4), సిద్దేశ్వరి(3)లు బైక్‌పై కదిరికి వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో ముగ్గురు మరణించగా తీవ్రంగా గాయపడిన కవితను తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. మదనపల్లె ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను సాయంత్రం కుమ్మరపల్లికి తీసుకొచ్చారు. మృతదేహాల రాకతో గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. కమ్మరపల్లికి పక్కనే ఉన్న ఎర్రగుంట్లలో తండ్రి, బిడ్డల అంత్యక్రియల నిర్వహణ కోసం పక్కపక్కనే మూడు సమాధులు తవ్వి కార్యక్రమం పూర్తి చేశారు. ఈ సందర్భంగా కుటుంబీకులు, బంధువుల రోదనలతో ఎర్రగుంట్లలోనూ విషాదం అలుముకుంది.

కవిత కంట కన్నీరు..

రుయా ఆస్పత్రి ఐసీయూలో వైద్యులు కవితకు చికిత్స అందిస్తున్నారు. తలపై తీవ్ర గాయం కావడం, కాలు విరగడంతో పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు చెప్పినట్లు సోమశేఖర మేనమామ గోపాల్ తెలిపారు. ప్రమాదంలో భర్త, బిడ్డలకు ఏమైందో తెలియక..కళ్లు తెరిచి మాట్లాడే స్థితిలో లేని కవిత కళ్ల నుంచి కన్నీరు వస్తోందని గోపాల్ చెప్పారు. ఆస్పత్రిలో ఆ స్థితిలోనూ ఆమె వారికి ఏమైందని ఆందోళనతో ఉన్నట్లు అనిపిస్తోంది. తల్లి ఆస్పత్రిలో ఉండగా బిడ్డలు, భర్త అంత్యక్రియలు జరిగిపోయాయి.

కులాంతర వివాహం

కుమ్మరపల్లికి చెందిన సోమశేఖర్ ఎస్సీ కాగా ఈ పల్లికి పక్కనే ఉండే పెమ్మన్నగారిపల్లి ఎస్టీ కులానికి చెందిన కవితను ప్రేమించి వివాహం చేసుకున్నారు. ఐదేళ్ల క్రితం వివాహం జరగ్గా, ఏడాదిగా మదనపల్లెలో కమ్మి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. తరచూ స్వగ్రామానికి వచ్చి వెళ్తుండేవాడు. ఇద్దరు బిడ్డలతో హాయిగా సాగిపోతున్న జీవితాన్ని ప్రమాదం ఒకేసారి చిదిమేసింది.

ఇరువర్గాల ఘర్షణ

- ఇద్దరికి తీవ్ర గాయాలు
- ఏడుగురిపై కేసులు నమోదు



ఘర్షణలో గాయపడిన నాగభూషణం



మరోవర్గం దాడిలో గాయపడిన నరేష్

మదనపల్లె : ఇంటికి సమీపంలోని పేడదిబ్బ స్థలం విషయమై శనివారం రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా, ఏడుగురిపై కేసులు నమోదయ్యాయి. మదనపల్లె మండలం పోతబోలు పంచాయతీ పాలెంకొండకు చెందిన చంద్ర కుమారుడు నాగభూషణం(27), అదే గ్రామానికి చెందిన నాగరాజు కుమారుడు నరేష్(30) మధ్య గత కొంతకాలంగా ఇంటి సమీపంలో ఉన్న పేడదిబ్బ స్థలం విషయమై గొడవలు జరుగుతున్నాయి. అందులో భాగంగా ఇదివరకే ఇరువర్గాలపై కేసు నమోదైంది. ప్రస్తుతం వివాదం కోర్టులో నడుస్తోంది. అయితే విచారణలో ఉన్న కేసులో రాజీ పడాల్సిందిగా శనివారం రాత్రి ఇరువర్గాల మధ్య చర్చలు జరిగాయి. ఈ విషయమై మాటామాటా పెరిగి నాగభూషణంపై నరేష్, అతడి భార్య సుమతి, తల్లి ఇందిర, చెల్లెలు లోకేశ్వరి కలిసి రాళ్లు, కర్రలతో దాడిచేశారు. అదే సమయంలో నరేష్‌పై నాగభూషణం, చంద్ర, కుమారి కలిసి దాడికి పాల్పడ్డారు. ఇరువర్గాల ఘర్షణలో నాగభూషణం, నరేష్ తలలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వేర్వేరు అంబులెన్స్ వాహనాల్లో వారిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న తాలూకా సీఐ కళా వెంకటరమణ ఆస్పత్రికి చేరుకుని గొడవకు సంబంధించిన వివరాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. ఆదివారం నాగభూషణం ఫిర్యాదు మేరకు నరేష్, సుమతి, ఇందిర, లోకేశ్వరిలపై, నరేష్ ఫిర్యాదు మేరకు నాగభూషణం, చంద్ర, కుమారిలపై రెండు కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వివాహిత అనుమానాస్పద మృతి

అనంతపురం : నగరంలోని బుద్ధప్పనగర్‌లో ఓ వివాహిత మృతిపై అనుమానాలు నెలకొన్నాయి. వన్‌టౌన్ సీఐ వి.రాజేంద్రనాథ్ యాదవ్ తెలిపిన మేరకు... అన్నమయ్య జిల్లా పెద్దమండ్యం మండలం ఎస్. కొట్టాలపల్లికి చెందిన శ్యామల (28)కు అనంతపురం నగరానికి చెందిన భాస్కర్‌తో 13 సంవత్సరాల క్రితం వివాహమైంది. కర్నూలు జిల్లా పత్తికొండలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న భాస్కర్... పత్తికొండలోనే ఉంటూ శని, ఆదివారాల్లో అనంతపురానికి వచ్చి వెళ్లేవాడు. ఈ క్రమంలో బుద్ధప్పనగర్‌లోని తన ఇంటిపై భాగాన ఉన్న రేకుల షెడ్డులో ఆదివారం శ్యామల ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయాన్ని గుర్తించిన భాస్కర్ వెంటనే శ్యామల కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. ఆమె ఆత్మహత్యకు మీరే కారణమంటూ ఫోన్‌లో పేర్కొన్నాడు. దీంతో కుటుంబ సభ్యులు అనంతపురానికి చేరుకుని కుమార్తె మృతదేహాన్ని పరిశీలించి, బోరున విలపించారు. కొన్నేళ్లుగా తమ కుమార్తెను అల్లుడు పుట్టింటికి పంపడం లేదని, దీంతో తరచూ తమకు ఫోన్ చేసి బాధపడుతూ ఉండేదని తెలిపారు. శ్యామల మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయంటూ మృతురాలి తల్లి రామలక్ష్మి చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నెమలికి వైద్య సేవలు



అనారోగ్యంతో కదలలేని స్థితిలో ఉన్న నెమలి



నెమలికి వైద్యసేవలు అందిస్తున్న అటవీ, పశువైద్యశాఖ అధికారులు

గుర్రంకొండ : అనారోగ్యంతో ఎగరలేక, నడవలేక అచేతన స్థితిలో పడిపోయిన నెమలికి అటవీ, పశువైద్యశాఖ అధికారులు వైద్యసేవలు అందించిన సంఘటన మండల కేంద్రమైన గుర్రంకొండలో జరిగింది. గుర్రంకొండకు సమీపంలో తోపువంక ప్రాంతం గుట్టల నడుమ ఉంది. ఇక్కడ నెమళ్ల గుంపులు ఎక్కువగా సంచరిస్తూ ఉంటాయి. పొలాలు, మామిడితోటల్లో ఓవైపు రైతులు పనులు చేసుకొంటున్నా నెమళ్లు మాత్రం యథేచ్ఛగా సంచరిస్తుండడం ఇక్కడ సర్వసాధారణం. ఈనేపథ్యంలో ఆదివారం స్థానిక ఈడిగ శ్రీరాములుకు చెందిన మామిడి తోటలో ఓ నెమలి కదలలేని స్థితిలో పడిపోయింది. గమనించిన రైతు అటవీశాఖ అధికారులు రామ్మోహన్, మల్లికార్జునలకు సమాచారం అందించారు. వారు పశువైద్యశాఖ సిబ్బంది సుధాకర్‌కు విషయం తెలిపారు. అందరూ కలసి మామిడితోట వద్దకు చేరుకొని నెమలికి అక్కడే వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎక్కువ జ్వరంతో బాధపడుతుండడంతో తీవ్ర అనారోగ్యానికి గురైనట్లు అధికారులు గుర్తించారు. వెంటనే తగిన మందులు, ఇంజెక్షన్లు ఇచ్చి వైద్యసేవలు అందించారు. నెమలికి తాగు నీరు అందించి అక్కడే ఉంచారు. జాతీయ పక్షి నెమలికి ఇలా వైద్యసేవలు అందించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం.

రాయచోటి జిల్లా కేంద్రంగా ఉంటుంది



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి టౌన్ : రాయచోటి ఎప్పటికీ జిల్లా కేంద్రంగా ఉంటుందని, జిల్లాను మారుస్తారనే వార్తలను ఎవరూ నమ్మరాదని రాష్ట్ర రవాణా, క్రీడలు, యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని గున్నికుంట్ల రోడ్డులో రాయచోటి నియోజక వర్గంలోని రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన ప్రాణం ఉన్నంత వరకు జిల్లాను మార్చనీయనని పునరుద్ఘాటించారు. అలాగే రాయచోటిలో అందరికీ అనుకూలమైన ప్రదేశంలో క్రికెట్ స్టేడియం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. వెంచర్లు వేసే సమయంలో అధికారులు ఎవరైనా అవినీతికి పాల్పడితే తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కంటైనర్ లారీ



ప్రమాదంలో దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు ముందు భాగం

సిద్దవటం : తిరుపతి నుంచి కడపకు వస్తున్న ఆర్టీసీ డీలక్స్ బస్సును కడప నుంచి తమిళనాడుకు వెళుతున్న కంటైనర్ లారీ మండలంలోని కనుమలోపల్లె గ్రామ సమీపంలో ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. గాయపడిన ప్రయాణికులను 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న సిద్దవటం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

సీపీఆర్ కొత్త అపార్ట్‌మెంట్‌కు భూమి పూజ



సీపీఆర్ కొత్త అపార్ట్‌మెంట్ ప్లాట్స్‌కు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆ సంస్థ ఎండీ, ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : సీపీఆర్ కన్‌స్ట్రక్షన్ వారి ఆధ్వర్యంలో మంగళం రోడ్డులోని ఎంఆర్ఎఫ్ షోరూంకు ఎదురుగా నిర్మించనున్న సీపీఆర్ సరికొత్త 2బీహెచ్‌కే అపార్ట్‌మెంట్ నిర్మాణానికి ఆదివారం ఘనంగా భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఆర్ సంస్థ ఎండీ చలపతిరెడ్డి మాట్లాడుతూ ప్రత్యేకమైన, ఆధునిక సదుపాయాలతో కూడిన 2బీహెచ్‌కే ప్లాట్లను ప్రవేశ పెడుతున్నట్లు తెలిపారు. ప్రీ బుకింగ్ ప్రారంభమైందని, ప్రారంభ ఆఫర్ ధర రూ.37 లక్షలు మాత్రమేనని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9492013322, 9492013366 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ డైరెక్టర్లు కాశీ విశ్వనాథ్, లోకేష్, వినీష్ పాల్గొన్నారు.

అధికార పార్టీ నాయకుడి సేవలో గ్రామ పంచాయతీ ట్రాక్టర్



గాలివీడు రైస్ మిల్లులో బియ్యం బస్తాలతో ఉన్న మాధవరం పంచాయతీ ట్రాక్టర్

టాస్క్‌ఫోర్స్ : గ్రామ పంచాయతీలోని చెత్తా చెదారం నిల్వలను తొలగించేందుకు ఏర్పాటు చేసిన ట్రాక్టర్ స్థానిక అధికార పార్టీ నాయకుని సేవలో తరిస్తోంది. రాయచోటి మండలం, మాధవరం గ్రామ పంచాయతీకి చెందిన ప్రభుత్వ నిధులతో ట్రాక్టర్ ఏర్పాటు చేశారు. ఈ ట్రాక్టర్ సాయంతో గ్రామ పంచాయతీలోని చెత్తా చెదారాన్ని తొలగిస్తూ పంచాయతీ అవసరాలకు వాడుకునేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు (చిల్లర దుకాణం వ్యాపారి) ట్రాక్టర్‌ను తన ఆధీనంలో పెట్టుకొని వ్యవసాయం, ఇతర సొంత అవసరాలకు ఉపయోగించుకుంటున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఆదివారం గ్రామ పంచాయతీకి సంబంధించిన ట్రాక్టర్‌లో వడ్లను (బియ్యంగా) ఆడించుకోవడానికి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న గాలివీడు మండల కేంద్రంలోని రైస్ మిల్లుకు తీసుకెళ్లారు. గాలివీడులోని రైస్ మిల్లు నుంచి బియ్యం బస్తాలతో ఆ ట్రాక్టర్ తిరిగి రాత్రికి గ్రామానికి చేరుకుంది. అధికారాన్ని అడ్డుపెట్టుకొని పంచాయతీకి సంబంధించిన ట్రాక్టర్‌ను తనకు ఇష్టం వచ్చిన రీతిలో సొంత అవసరాలకు వాడుకుంటున్నా సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. పంచాయతీలోని కొంతమంది అధికారులను లోబరుచుకుని ట్రాక్టర్ మరమ్మతుల పేరిట లక్ష రూపాయల వరకు పంచాయతీ నిధులను డ్రా చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఉన్నతాధికారులు ఇప్పటికైనా సంబంధిత ట్రాక్టర్‌ను పంచాయతీ విధులకు మాత్రమే ఉపయోగించేలా చూడటంతోపాటు డ్రా చేసిన నిధులు ఎక్కడ, ఎందుకు ఖర్చు పెట్టారో నిగ్గు తేల్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు



రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజానాయక్

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు తీవ్రంగా గాయపడి మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సత్యసాయిజిల్లా తనకల్లు మండలం నక్కరాళ్లతాండాకు చెందిన చంద్రానాయక్ కుమారుడు రాజానాయక్(40) తిరుపతి నగరం మంగళంలో ఉంటూ స్థానికంగా హోటల్‌లో పనిచేస్తున్నాడు. ఆదివారం ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యంలోని వాల్మీకిపురం సమీపంలో ఎదురుగా మరో ద్విచక్రవాహనం రాజానాయక్‌ను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదంలో తలకు గాయం కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. అదేవిధంగా పెద్దమండ్యం మండలం కలిచెర్ల పంచాయతీ కోటకాడపల్లెకు చెందిన శేఖర్(35), మదనపల్లెలో ఉంటూ ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో కాంట్రాక్ట్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం నీరుగట్టువారిపల్లె నుంచి ద్విచక్రవాహనంలో వస్తుండగా, స్పీడ్‌బ్రేకర్ వద్ద అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆయా ఘటనల్లో స్థానిక పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మృతి చెందిన కృష్ణప్ప

కురబలకోట : మండలంలోని ముదివేడు దగ్గర దళితవాడకు చెందిన కృష్ణప్ప (50) అనుమానాస్పద స్థితిలో ఆదివారం మృతి చెందారు. ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ కథనం మేరకు. కృష్ణప్ప కూలి పనులు చేసుకునేవాడు. భార్యను వదిలేసి మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడు. శనివారం రాత్రి తొమ్మిది గంటల వరకు ఊరిలో ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఆ తర్వాత పక్కనున్న ముదివేడుకు వెళ్లినట్లు సమాచారం. ఆదివారం ఉదయం ఊరికి దగ్గరలోని పొలాల్లో శవమై కన్పించాడు. ఒంటిపై రక్త గాయాలు ఉన్నాయి. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు నమోదు చేశారు. కారణాలు ఏమిటన్నది తెలియడం లేదు. పరిసర ప్రాంతంలో టమాటా పంటలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాను పరిశీలిస్తే శనివారం రాత్రి ఇతన్ని కొంత దూరం కుక్కలు వెంబడించినట్లు కన్పిస్తోందని చెబుతున్నారు. ఆ తర్వాత ఏమైంది తెలియడం లేదు. ఇతనికి స్థానికంగా గొడవలు లేవు. ఒక వేళ కుక్కలు ఏమైనా ఇతన్ని చంపాయా..లేదా కారణం ఏమిటన్నది అంతుపట్టడం లేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏమైంది బిడ్డా!

- నారాయణ స్కూల్ హాస్టల్‌లో విద్యార్థి అనుమానాస్పద మృతి
- కన్నీటి పర్యంతమైన తల్లిదండ్రులు



మదన్‌మోహన్‌రెడ్డి మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి, బంధువులు



మదన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

కడప అర్బన్/సీకేదిన్నె : హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్న తన కుమారుడితో ఆ తండ్రి ఆనందంగా గడిపాడు. వెంట తీసుకెళ్లి బిరియాని తినిపించాడు. కాసేపు యోగక్షేమాలు ముచ్చటించి మురిసిపోయాడు. కుమారుడిని హాస్టల్ వద్ద వదిలి ఇంటికి చేరిన గంటల వ్యవధిలోనే మీ కుమారుడికి పల్స్ పడిపోయాయి.. రిమ్స్‌లో చేర్పించామంటూ పాఠశాల యాజమాన్యం నుంచి ఫోన్‌కాల్. ఏమైందో ఏమోనని హుటాహుటిన రిమ్స్‌కు వెళ్లిన తల్లిదండ్రులకు కడుపుకోతే మిగిలింది. విగతజీవిగా పడి ఉన్న కుమారుడిని చూసిన కన్నవారి రోదనలు మిన్నంటాయి.

కడప కేఎస్ఆర్ఎం కళాశాల సమీపంలో ఉన్న నారాయణ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న నందిమండలం మదన్‌మోహన్‌రెడ్డి (15) అనుమానాద స్థితిలో ఆదివారం మృతి చెందాడు. ఈ సంఘటనపై మృతుడి తల్లిదండ్రులు, బంధువులు ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చింతకొమ్మదిన్నె మండలం కొప్పర్తి గ్రామానికి చెందిన నందిమండలం శేఖర్, వాసవిలకు ఒక్కగానొక్క కుమారుడు మదన్‌మోహన్‌రెడ్డి, కుమార్తె నందిని ఉన్నారు. మదన్‌మోహన్‌రెడ్డి నారాయణ స్కూల్‌లో 9వ తరగతి, నందిని 7వ తరగతి చదువుతున్నారు. అదే క్యాంపస్‌లో వేర్వేరుగా హాస్టల్‌లో ఉంటున్నారు. మృతుడి తండ్రి శేఖర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం మదన్‌మోహన్‌రెడ్డిని తండ్రి శేఖర్ బయటకు తీసుకెళ్లి బిరియాని తినిపించుకుని మళ్లీ స్కూళ్లు వద్ద వదిలి వెళ్లాడు. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో మీ కుమారుడికి పల్స్ పడిపోయాయి. రిమ్స్‌కు తీసుకుని వచ్చామని స్కూల్ యాజమాన్యం శేఖర్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన రిమ్స్ క్యాజువాలిటీకి వచ్చే సరికి అప్పటికే మదన్‌మోహన్‌రెడ్డి విగతజీవిగా పడి ఉన్నాడు.

తండ్రి ఆవేదన..

నా కుమారుడిని ఆదివారం కావడంతో బయటకు తీసుకెళ్లి బిరియాని తినిపించి మధ్యాహ్నం స్కూల్ వద్ద వదిలి పెట్టానని, కొన్ని గంటల్లోనే స్కూల్ యాజమాన్యం వారు ఫోన్ చేసి పల్స్ పడిపోయాయని తెలపడటంతో రిమ్స్‌కు పరుగెత్తుకుని వచ్చామని అప్పటికే నా కుమారుడు మృత్యువాత పడ్డాడని ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్ యాజమాన్యం బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని, నా కుమారుడు ఎలా చనిపోయాడో తెలియడం లేదని బోరున విలపిస్తూ తెలిపాడు. పాఠశాల యాజమాన్యమే తన కుమారుడిని చంపేశారని వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సీకేదిన్నె పోలీసులు వచ్చి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. నారాయణ స్కూల్‌ను ఆదివారం రాత్రి కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీకేదిన్నె సీఐ శంకర్ నాయక్‌లు సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు పాఠశాల ఆవరణలోని సీసీ పుటేజీలు పరిశీలించారు. విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

ఎరక్కపోయి.. ఇరుక్కుపోయే!


డబ్బాలో తల ఇరికించుకున్న శునకం




డబ్బాలో ఇరుక్కుపోయిన తలతో శునకం

రాయచోటి : రాయచోటిలో ఆకలితో ఉన్న ఓ కుక్క ఆహారం కోసం బిస్కెట్ బాక్సులో తల దూర్చింది. అందులో ఉన్న బిస్కెట్లను పుష్టిగా ఆరగించేసింది. ఆపై డబ్బా నుంచి తలను బయటికి తీద్దామని చేసిన ప్రయత్నం వికటించింది. డబ్బా లోపల తల ఇరుక్కుపోయింది. ఆ డబ్బా అద్దంలా కనిపిస్తుండటంతో రోడ్డు మార్గం కనిపిస్తోంది. కాని అందులో నుంచి తలను బయటకు తీసుకోలేక ఆ శునకం రెండు రోజులుగా రాయచోటి పట్టణం మందపల్లి మార్గం వెంట తిరుగుతోంది. కుక్కను పట్టుకొని డబ్బాను తొలగిద్దామని ప్రయత్నం చేసిన యువకుల చేతికి చిక్కకుండా పరుగులు తీస్తోంది. రెండు రోజులుగా నీరు, ఆహారం లేక బక్కచిక్కి దీనంగా పరుగులు పెడుతున్న ఆ కుక్కను చూసిన వారు ఓ మై డాగ్.. అయ్యో పాపం అనడం తప్ప ఏమీ చేయలేకపోతున్నారు.

వేధింపులు తాళలేక దంపతుల ఆత్మహత్యాయత్నం





చికిత్స పొందుతున్న నాగేంద్ర, రెడ్డెమ్మ

పీలేరు : బంధువుల వేధింపులతో దంపతులు ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన ఆదివారం పీలేరు పట్టణం మోడల్ కాలనీలో జరిగింది. బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. స్థానిక మోడల్ కాలనీలో నాగేంద్ర, రెడ్డెమ్మ దంపతులు గత పదిహేనేళ్లుగా జీవనం సాగిస్తున్నారు. అయితే వారు ఉంటున్న ఇంటి విషయమై సమీప బంధువులు రఘునాథ, లోకేశ్వరి తరచూ గొడవ పడేవారు. ఈ క్రమంలో శనివారం రాత్రి మరోసారి గొడవ పడి తీవ్ర మనస్తాపం చెందిన నాగేంద్ర, రెడ్డెమ్మ అధిక మొత్తంలో మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేశారు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.